# తప్పెక్కడ?

'చిన్ను'




మరునాడు చెప్పబోయే పాఠాల్ని లత ఎప్పుడూ ఇంటి దగ్గర ప్రిపేరవదు. కాలేజీలో లీజరవర్సు లోనే ప్రిపేరవుతుంది.

పనులన్నీ ముగించుకొని ఇకనామిక్ తీరీ మిల్‌ని చదువుకుంటూ వాలు కుర్చీలో నడుం వాల్చిన లతని చూస్తే మూర్తికి ఆశ్చర్యం ముంచుకొచ్చింది.

ఓ మూడు నిమిషాలు పోనిచ్చి, మళ్ళీ చూశాడు మూర్తి. లత వాలకం చూస్తే పాఠాలు చదువుకుంటున్న దానిలా లేదు. పుస్తకం చాటు చేసుకొని ఏదో ఆలోచిస్తున్నట్టుగా ఉంది.

మళ్ళీ మళ్ళీ చూశాడు. "ఏమిటోయ్ ఆలోచన?" అన్నాడు మరి ఉండబట్ట లేక.

"ఊఁ? ఏమ్మీ, ఏం లేదూ" అంది లత ఈ లోకంలోకి వస్తూ.

"ఏం? అంత చెప్పకూడని విషయమా?"

"ఊహూఁ. మీకు చెప్పకూడని దంటూ ఏదైనా నా కుందా? మీరు శ్రద్ధగా వింటారా? నేను ఓ విషయం చెపుతాను. అంతేకాదు, ఆ తరవాత నేను చేద్దాం అనుకున్న పనికి మీరు అనుమతి నివ్వాలి. అభ్యంతరం చెప్పకూడదు. అలాగేనా?" అంటూ అతని దగ్గరగా వచ్చి మంచం మీద కూర్చుంటూ అంది.

ఆమె చేతిని తన చేతిలోకి తీసు కుంటూ, ఒట్టు వేస్తున్నట్టుగా, "ఎప్పు డైనా అభ్యంతరం చెప్పానా? అడుగు" అన్నాడు మూర్తి.

లతలో ఓ గుణం ఉంది. తాను ఏది చెప్పినా అందరూ చక్కగా వింటారు. ఎవ్వరూ వ్యతిరేకించరు. బహుశా ఆ లక్షణం ఆమె గొంతులో ఉందేమో? క్లాసులో పిల్లలకు పాఠాలు అర్థమైనా, కాకపోయినా అందరి చెవులు మటుకూ ఆమె పాఠాన్నే వింటుంటాయి. ఏ విషయం చెపుతున్నా విసుగనిపించదు. అంత చక్కని ఆకర్షణ ఆమె పలుకుల్లో ఉంది.

అతని చేతుల్లో ఇమిడిన తన చేతుల్ని విడిపించుకుని చెక్కిట ఒక చెయ్యి వేసుకొని, రెండవ చేతిని అతని గుండెలపై ఆన్చి చెప్పసాగింది.

"త్రీ ఇయర్స్ బ్యాక్, అంటే నేను

ఎమ్. ఎ. ప్రీవియస్ చదువుతున్నప్పుడు మా కో లెక్చరర్ వచ్చేవారు.

ఆయన నిజంగా నా కాదర్శపురుషు డనుకోండి! మొదటి రోజు ఆయన ఇంట్రడక్టరీ క్లాసు చెప్పుకొచ్చారు. 'ఇకనామిక్స్ అంటే అర్థశాస్త్రం. అర్థం అంటే ధర్మార్థ కామ మోక్షాల్లో అర్థం కాదు. అక్కడ అర్థం అంటే వేరు. కామం అంటే. . .' అని ఆ కామం దగ్గరే క్లాసుని వెళ్ళబుచ్చారు.

కో—ఎడ్యుకేషన్ నా కదే మొదటి సారేమో. ఎంత సిగ్గు వేసిందనుకున్నారు! మొట్టమొదటి క్లాసులోనే అలా వాగితే ఎంత 'ఇది' వేసిందో!

ఆయన క్లాసులో కూసే బూతు కూతలు ఇన్నీ అన్నీ కావు. పాఠంలోంచి ఎలాగో సెక్స్ టాపిక్ లోకి డీవియేట్ అయిపోయేవారు. అలా అలా అందులో మునిగిపోవడమే కానీ, మళ్ళీ తేలడం అంటూ ఉండేది కాదు.

హ్యూమన్ వాంట్స్, శాటిస్‌ఫాక్షన్ వంటి పదాల్లో అర్థాలు తీసేవారు కదా — ఘోరం అనుకోండి.

మీరూ ఇకనామిక్స్ చదివారు కదా, 'లా— ఆఫ్ డిమినిషింగ్ మార్జినల్ యుటిలిటీ' గురించి గుర్తుందా?"

"ఆ! అదే గుర్తు! ఎప్పుడనగా చదివాను!!"

"అమాత్రం గుర్తు లేదా? ఒక ఆపిల్‌పండు తిన్నప్పు డుండే తృప్తి రెండో ఆపిల్‌పండు కుండదు. మూడో దానికి ఇంకా క్షీణిస్తుంది" అంది లత.

"ఇప్పుడీ యుటిలిటీ థీరి చెప్పకుండా అసలు సంగతిలోకి రా" అన్నాడు మూర్తి.

'ఇదేనండీ! ఆ యుటిలిటీని, శాటిస్‌ఫాక్షన్ని ఫస్ట్‌నైట్ కపుల్‌కి అన్వయిస్తూ, వాళ్ళలో ఆ చర్యల వల్ల కలిగే శాటిస్‌ఫాక్షన్ ఇంక్రీజ్ అవుతుందే కానీ డిక్రీజ్ అవదట. అబ్బ! నే నింకా చాలా స్మూత్‌గా చెప్తున్నాను. ఆయన ఎంత అసహ్యంగా మాట్లాడేవారో!

మేం ఆడవాళ్ళం చాలా సిగ్గుతో చచ్చిపోయేవాళ్ళం. క్లాసుకి ఇర్రెగ్యులర్‌గా వచ్చే స్టూడెంట్స్ మటుకు ఆయన్ని తెగ లైక్ చేసేవారు. ఎంచక్కా పాఠా లెప్పరు. హాయిగా 'హాయి, హాయి' కబుర్లు వినచ్చు.

మా క్లాసులో ప్రేమ్‌రాజు, సుబ్బరాజు అని ఇద్దరు డర్టీరోగ్స్ ఉండేవాళ్ళు లెండి. సాధారణంగా ఈ మాస్టారి క్లాసుకి తప్ప ఎప్పుడూ వచ్చేవారు కాదు. అందులో ప్రేమ్‌రాజుకి చూయింగ్ గమ్ తినడం అలవాటు. క్లాసులో దవ డాడిస్తున్నాడు కాలేజీ, ముందు బెంచీలో ఉంటూంగా మాకు కనబడదు. అతన్ని నిలబెట్టి, 'ఏమిటోయ్ ఆ మూతి పెదాలుగా ఆడిస్తున్నావు?' అన్నారు.

ఈ మాస్టారిని క్రిటిక్కైద్దామని కాబోలు ఆ అబ్బాయి అంతకన్నా, 'నాకు "విడి" వచ్చిందండీ' అన్నాడు.

క్లాసంతా ఫెళ్ళున నవ్వారు.

సుబ్బరాజు నిలబడి, 'మాస్టారూ! అయితే "విడి" మూతికికూడా వస్తుందాండీ?" అని అమాయకంగా అడిగినట్టే అడిగాడు.

ఇంకా నేను పచ్చిగా మాట్లాడు తున్నాను. ఆ రోజు ఆ అబ్బాయిలకీ, మా మాస్టారికీ జరిగింది కదా సంభాషణ! ఓహ్! ఏం చెప్పను? నగ్నంగా మాట్లాడ్డం అంటారే— అలాగే చెప్పేసేవండీ! దియుల్లి!"

"నిజంగా ఎంత అదృష్టవంతులు మీరు! చక్కగా నేను మీ యూనివర్సిటీలో, మీ క్లాసులో ఎమ్. ఎ. చేస్తే ఎంత బాగుండేది!"

మూర్తి నోటమ్మట ఆ మాటలు.

'తెలుసులేవోయ్! మహా చెప్పొచ్చావ్! పాఠాలెలా ఉన్నా గ చదువుతుంటే రావా? జనరల్ నాలెడ్జ్ కి— జనరల్ నాలెడ్జి — అది కావాలి' అంటూ అలా టాపిక్ ఛేంజ్ చేసేవారు.

ఆయనకి ఒక్కో రోజు ఏమైందో ఏమిటో "సాయిబాబా" అని, "సాధు బాబా" అని గురువులు, గురుతత్త్వం గురించి చెప్పేవారు.

ఒక్కో రోజు భారతానికీ, మన శరీరావయవాలకి కంపేరిటివ్‌గా — పంచేంద్రియాలూ పంచ పాండవులట — మనసు శ్రీకృష్ణుడట— అన లా వాగుడుకి అర్థం ఏమిటో తెలిసేది కాదు.

కొంతమంది ఆయనికి శిష్యులుండే వారు. అంటే భక్తకోటి బృందం అన్నమాట. ఆయన దగ్గర హోమియో పతి ట్రీట్‌మెంటుకూడా తీసుకునేవాళ్ళు. క్లాసులో ఎప్పుడూ వాళ్ళకే మార్కులు. ఈ ఇంటర్నల్ ఎసెస్‌మెంట్ వల్ల చచ్చినట్టు పడుండేవాళ్ళం."

> **రహస్యం**
>
> జీవితంలో చాలామంది తమ జీవితాల్లో నే చివరి రోజుల్లో అనుభవించబోయే బాధలకు బీజాలు నాటు కుంటారు.
>
> —బ్రూయేరే

పూర్తిగా రాకుండానే మూర్తి కల్పించుకున్నాడు.

"ఏం? ఇది బాగులేదూ?" అంది అప్పుడే గుప్పిగా గిల్లిన అతని బుజ్జమీద మెల్లగా రాస్తూ.

"లేకపోతే అలాంటి క్లాసులో కూర్చో వాలనుందా? ఏం, బూతుకూతలు వినడం ఒక్కటే మజా అనుకున్నారా? ఆయన వాగని అంశం అంటూ లేదు. ఒక్క సెక్సేమిటీ, భగవంతుడేమిటీ, భక్తి తత్త్వం— ఆస్తికత్వం . . . పీటికి తోడు మాత్రిణాలు తోడటానికి ఆయనో హోమియోపతి డాక్టరుకూడా!

ఒక్కో రోగం గురించి చెప్పడం, మందులు చెప్పడం, రోగాలు ఎందు కొస్తాయో చెప్పడం. ఆయన టచ్ చెయ్యని సబ్జెక్టే లేదు, ఒక్క క్లాసు పాఠం తప్ప.

అప్పటికీ కొంతమంది స్టూడెంట్స్ అప్పుడప్పుడూ గుర్తు చేసేవారు— 'ఇది ఇకనామిక్స్ క్లాసండీ! పాఠం!' అని.

"మరి అలాంటి చెత్త మాస్టారా నీకు ఆదర్శపురుషుడు?"

"లెట్‌మి కమ్ టు ది పాయింట్. పూర్తిగా చెప్పనివ్వండి! అప్పుడే అను కున్నాను — ఫ్యూచర్లో ఎప్పుడైనా పాఠాలు చెప్పే వృత్తినే చేయవలసి వస్తే, ఈయనలా ఉండకూడదు. సిన్సియర్‌గా, లాయల్‌గా పాఠాలు చెప్పే అధ్యాపకురాలిగా ఉండాలనీ, ఆయన్ని చూసి ఆయనకి పూర్తి వ్యతిరేకంగా ఉండడమే ఆదర్శ అధ్యాపకత్వం అనీ అనుకున్నాను.

క్లాసులో సొసుకోలు పొమ్మ వెయ్యడం అంత నేస్టీ థింగ్ మరొకటి ఉండదు. నా కనలు ఇప్పటికీ డౌటే— మా మాస్టారికి మా సిలబస్ ఏమిటో తెలుసో లేదో అని. జీతం తీసుకుంటున్నందుకు స్టూడెంట్స్‌కి సరైన పాఠాలు చెప్పక పోతే— ఎందుకు చెప్పండి? డబ్బుకూడా అరగదు."

"ఎగ్రీడ్— ఒప్పుకుంటున్నాను ఇంతకీ ఈమ లేనే చెప్పు?" అన్నాడు మూర్తి అసహనంగా.

"తొందరపడకండి. కావలసిన పాయింటుకి వచ్చేస్తున్నాను. ఇప్పుడు నాకు నాలుగో నెల కదా? నేను లీవు తీసుకునే లోపున కోర్సు పూర్తి చేద్దాం అని నా ఉద్దేశం. అలాగే సిలబస్‌ని ఎడ్జస్టు చేసుకున్నానుకూడా!

కానీ, ఎల్లుండి నుండీ ఇండెఫినిట్ స్ట్రైకట. పాపం, చిన్న గుంటవెధవ లండీ! ఈ స్ట్రైకు రోజులు ఎన్నో ఏమిటో! నేను సెలవులోకి వెళ్ళిపోతే, వాళ్ళంతట వాళ్ళు ఎలా చదువుకోగలరు, చెప్పండి?

కోర్సు పూర్తికాకపోతే ఎలాంటి బాధ ఉండేదో నాకు సొంత అనుభవం. ఈ అనుభవం నా విద్యార్థులు ఎందుకు పొందాలి?"

"అందుకని. . ."

"అందుకని స్టూడెంట్స్‌ని ఇంటికి రమ్మంటాానండి. మన మెయిన్ హాలు పెద్దది కదా— ఈ స్ట్రైక్ పీరియడ్లో వాళ్ళొప్పుకుంటేనే, ప్రైవేటు క్లాసులు చెప్పి ఎలాగైనా కోర్సు పూర్తి చేస్తానండీ."

"ఏమిటీ! మీ గుంటవెధవల్ని ఇంటికి రమ్మంటావా? ఇల్లు నిలవాలనే! పీకి ఎందిరేసేయరూ?"

"ఏమాత్రం న్యూసెన్స్‌గా ఉన్నా నేను మటుకూ ఛీట్ చెయ్యగలనా? నాకు ప్రామిస్‌కూడా ఇచ్చారు. ఇప్పుడు మరి. . ."

"ప్చ్! ఏదో కడుపుతో ఉన్నావని కదా అని ఒప్పుకుంటున్నాను. నా కే మాత్రం విసుగనిపించినా. . ."

"మీ విసుగు నాకు మటుకు విసుగు కాదా?"

"ఆల్‌రైట్. ఎగ్రీడ్" అన్నాడు మూర్తి.

"థాంక్యూ" అంటూ గదిలో పెద్ద లైటు తీసేసి, బెడ్‌లైట్ వేసింది లత.

* * *

ఆయాసంతో అన్ని పనులూ ముగించు కొని మంచంపై మేను వాల్చింది లత.

"ఏం? ఈ రోజు ప్రిపేర్ అవవలసిన పాఠాలేం లేవా?" అన్నాడు అప్పుడే చదివేసిన పేపర్ని మడిచివేస్తూ మూర్తి.

"రేపు సాయంత్రానికి కదా? పొద్దుట కావచ్చు లేద్దురూ! మరిప్పుడేం చదవ లేను" అంది ఉస్సురంటూ.

"హాయిగా స్ట్రైకు పీరియడ్లో కూడా వి శ్రమించే పొట్నే కొనితెచ్చుకున్నావు. చెప్పానా? అంటూంటే నా ఖాత ఆయాస పడిపోతూ . . ."

"నాకూ అలానే అనిపిస్తోంది. పోనీ, వినేవాళ్ళుంటే ఎంత కష్టపడి అయినా చెప్పచ్చు. మొదటి రోజు ఓ గంట పాఠం చెప్పగానే ఓ ఫిఫ్టీ మినిట్స్ లీజర్ కావాలిట. పోనీ అని రీసెస్ ఇస్తే మన తోట నిండా సిగరెట్ పీకలూ, నానా న్యూసెన్సూను. అయినా క్లాసు చెప్పి నంత హాయిగా ప్రైవేటు క్లాసు చెప్పలేం లెద్దురూ! మొదటి రోజుండే స్ట్రెంగ్త్ రెండో రోజు లేదు. అలా అలా వాళ్ళ నంబరు తగ్గిపోతోంది, నా ఇంటరెస్ట్ చచ్చిపోతోంది. అరవై మందికి పదిహేను మంది కూడా రావటం లేదు."

"ఆఁ! సింగినాదం కాకపోతే. మరీ అంత సెన్సిటివ్ ఏమిటి లెద్దూ! కోర్సు అవకపోతే వాళ్ళ ఖర్మ! మధ్య నీ రెస్పాన్సిబిలిటీ ఏమిటి? వర్కింగవర్సులో చెప్పడమే నీ డ్యూటీ. ఇలా ఇళ్ళకి తీసుకొ రమ్మని 'రూ'లేం లేదుకదా?"

"వాళ్ళు రావడం వల్ల మీకు చికాకుగా ఉంది కదూ?" ఎంతో నొచ్చుకుంటున్నట్టుగా మొహం పెట్టి అంది.

"నా చికాకు మా టటుంచు. నీకు? డోర్టీగా చెప్పూ — నీకు చికాకుగా లేదూ?"

"నిజంగా స్టూడెంట్స్‌కి శాటిస్‌ఫాక్షన్ వస్తే ఎంతటి చికాకునైనా భరించవచ్చును. కానీ, మీకేం? మీకు బోరు కొడుతూందేమో అని."

"నీకు శాటిస్‌ఫాక్షన్‌గా ఉంటే ఎంతటి బోర్నైనా భరించగలనులే. కానీ, నువ్వు ఈ ప్రైవేట్ల వల్ల తృప్తి పొందుతున్నావా అని?"

"ప్చ్! పోనిద్దురూ! ఇంకా ఆ పిల్ల కాయల గొడవ మన కెందుకు? ఇంకేవైనా కబుర్లు చెప్పండి" అంది టాపిక్ మారుస్తూ.

"పోనీ, మన పిల్లకాయల గురించి చెప్పుకుందామా?" అన్నాడు ఆమె బొజ్జ మీద చిన్నగా దెబ్బ వేస్తూ.

ఆమె కళ్ళముందు చక్కని బాబు, అందాల బాబు ఆడుకుంటూ, చదువుకుంటూ బుద్ధిమంతుడులా కనిపించాడు.

కమ్మని తలపులతో కళ్ళు మూసుకుంది లత.

"ఇదిగో! మళ్ళీ నెలలు ముదిరే యంటే సినిమాలకి వెళ్ళటం అవదు. కమాన్, కమాన్" అంటూ హడావుడి పెట్టాడు మూర్తి.

"అబ్బా! పనులేవీ పూర్తి కాలేదు. అదీకాకుండా ప్రైవేటుకి కనీసం ఓ పదిమంది వచ్చినా ఈ వేళ చెప్పదా మనే అనుకున్నాను."

**తప్పులు**

రాత్రి పడుకోబోయే ముందు
ఒకసారి నీ తప్పులను గురించి
ఆలోచించుకో, నిద్రలో ఇతరుల
తప్పులను గురించి ఆలోచించు.

—డీనా పోమిత

"వాట్ నాన్సెన్స్! నీ పాఠాలు వాళ్ళకి బోర్ కొట్టడం వల్లే వాళ్ళు రావడం మానేసేరు. మరి ఊరికే వర్రీ అవకీ. ఇంక క్లాసులు కేన్సిల్ చేసే! ఎవరైనా వస్తే పనిపిల్ల చెబుతుందిలే — మరి నువ్వు క్లాసులు తీసుకోవని. కమాన్. హర్రీ అప్" అంటూ తొందర పెట్ట సాగాడు.

"వంట కూడా కాలేదండీ!" మరో అడ్డుపుల్ల వేసింది.

"హోటల్లో కానిద్దాం లేవోయ్. లే" అంటూ జబ్బ పట్టుకొని లేపాడు.

ఇద్దరూ హాల్లో కొచ్చేసరికి లైట్లార్పేశారు. ఏవేవో ఎడ్వర్టైజ్‌మెంట్లు చూపెడుతున్నారు. గేటువాడు సీట్లు చూపిస్తే తడుముకుంటూ కూర్చున్నారు మూర్తి, లత.

వాళ్ళకి ఎదురుగా ఒక ఆడ, ఒక మగ. ఆ పొడవాటి రెండు జడల ప్రత్యేకతే ఆ వ్యక్తి 'ఉమ' అని చెబుతున్నది.

మరి ఆ పక్కను ఎవరబ్బా?

కుతూహలంగా చూసింది. కానీ, చీకట్లో ఆనవాలు అంతు పట్టలేదు.

ఇంటర్ చదివే [illegible] గంటలకి బోయ్ ఫ్రెండ్సా! చిన్నగా [illegible]ంది.

"హరీ! [illegible]ం మీ దొప్పేమ కానీ, ఈ వేళ కూడా మిస్సైతే లతా మేడమ్ ఫీలవుతారు, హరీ!"

తుళ్ళిపడింది లత. అంటే ఉమ పక్కనున్న వాడు హరన్న మాట. తా జెడ్డ కోతి వనమెల్ల చెరిచిందట.

"హూ కేర్స్! ఆవిడో చాదస్తపు మేడమ్ దొరికింది మన పీకలమీదకి. నువ్వింతోటి ఒబీడియంట్ స్టూడెంటువిసిరా హాయిగా ప్రైవేకు రోజుల్లో ఖుషీ చెయ్యకుండా."

"లేదు, హరీ! ఆవిడ బాగానే చెబుతారు కదా?"

"క్లాసులో అంటే, పోనీ అనుకుందాం. ఇంటికి కూడా రమ్మని, వినండ[illegible] అని బోరేస్తే, వినేవాడు వినాలా? చావాలా? బోర్లోకి — పరమ బోర్!"

ముందర వాళ్ళ మాటలు తప్ప తెరమీద వేమీ వినబడటం లేదు లతకి. అలా సీటు మీద వెనక్కి వాలిపోవాల మంది. ఎంత ప్రయత్నించుకున్నా కన్నీ రాగటం లేదు.

అస లేం జరగనట్టుంటే!

ఆ మాటలన్నీ ఆయన కూడా వినే ఉంటారు. కళ్ళు తుడుచుకున్నా, వెనక్కి జారగిలబడినా ఆయనకి పట్టుబడిపోదూ!

మనసు వెయ్యి రకాల వేదనలతో మెలిబడిపోతూంది. రెస్ట్లెస్ అయిపోతూంది.

"లతా! ఇంటికి పోదామా?" అన్నాడు మీద చెయ్యి వేసి, గట్టిగా నొక్కుతూ.

మౌనంగా లేచింది.

ఇంటికొచ్చి, ఆయన గారి గుండెల మీద తల వాల్చి, కరువుతీరా ఏడ్చేస్తే గానీ హృదయం తేటపడలేదు.

* * *

"ఏం లతా? బాబిగాడి [illegible] ఎంతసేపూ? కాలేజీకి వెళ్ళవా?" అన్నాడు మూర్తి.

"ఆఁ! అయితే అయింది లెద్దురూ ఓ అయిదు నిమిషాల ఆలస్యం." బాబిగాడి మెడలో 'బిబ్' కడుతూ ఉంది.

"అసలు ఈ మధ్య ఇంటి దగ్గర ఏం చదువుతున్నట్టు లేదే!"

"ఎప్పుడైనా చదివేనా పెట్టానా ఇప్పుడు చదవడానికి."

"అప్పుడైతే ఖాళీ సమయాల్లో కాలేజీలోనే చదువుకొనే దానివి. ఇప్పుడు ఖాళీ దొరికితే ఇంటి కొచ్చేస్తున్నావుగా?"

"ఆఁ—కాకపోతే! క్లాసు లేనప్పుడు కూడా కాలేజీలో ఉంటానా. మరి పిల్లడో! ఆఁ! రావులమ్మా! ఇలా రావే, తల్లీ! నా కాలేజీ టైమైపోతోంది. చూడూ! బాబు ఇప్పుడే పాలు తాగి పడుకున్నాడు. నేను పన్నెండయేసరికి వచ్చేస్తాను. ఈ లోపునా వాడు లేచినా నువ్వు పాలు కలిపి పట్టబోకు. కాస్త ఆలా ఆడిపించు. మరీ ఏడిస్తే ..."

"ఏటమ్మా ఎప్పుడూ ఈ అప్పగింతలు? నా కెరికనేదా యేటి? గుటుకోజు నీళ్ళు పట్టాల. అంతే కదా?" అంది రావులమ్మ, చల్లారిపోయిన మరుగు నీటిని ఫ్లాస్కులోకి పోస్తూ.

హర్రీబర్రీగా కాలేజీకి పరుగెత్తింది లత.

* * *

ఆ రోజు క్లాసులో "లా ఆఫ్ డిమినిషింగ్ మార్జినల్ యుటిలిటీ" చెబుతూంది.

"ఒక ఆపిల్ పండు తిన్నప్పుడుండే తృప్తి రెండో ఆపిల్ కుండదు. మూడో దానికి క్షీణిస్తుంది...

దీనికి లిమిటేషన్స్ కూడా ఇచ్చేరు మన ఇకనమిస్ట్స్. కానీ, వాళ్ళఊహకి కూడా అందని కొన్ని శాటిస్‌ఫాక్షన్స్ ఉంటాయి ఈ జీవితంలో.

మన పిల్లలే ఉన్నారనుకోండి. ఒకసారి ముద్దు పెట్టుకుంటే ఒక రకమైన తృప్తి పొందుతాం. రెండో ముద్దుకి ఆ శాటిస్‌ఫాక్షన్ క్షీణిస్తుందా? నెవ్వర్.

స్వంతపిల్లలే కానక్కర్లేదు. ఏ చిన్న పిల్లలయినా అందంగానే ఉంటారు.

ఆ తృప్తి గురించి 'గీతాంజలి'లో ఠాగూర్ ఏం రాసేడో తెలుసా?"

"మేడమ్! ఇది ఇంగ్లీషు క్లాసు కాదండీ! ఇకనామిక్స్ పాఠం!" ఎక్కడో ఓ ధైర్యశాలి కంఠం.

"తెలుసులేవోయ్! మహా చెప్పొచ్చేవ్! అంతా తెలుగు మీడియమ్ కదా? ఆ మాత్రం చదువుకుంటే అర్థంకాదూ! కావలసింది జనరల్ నాలెడ్జోయ్ — జనరల్ నాలెడ్జి! అది లేకపోతే ఎలా? అసలు ఠాగూరన్న వాడే ఒకడున్నాడని, అతడికో నోబెల్ బహుమానం వచ్చిందని మీకు తెలుసా?

నిజంగా పసిపిల్లల్ని చూస్తే ఎంత ముచ్చట వేస్తుంది! అందుకే ఆ విశ్వకవి ఇలా అన్నాడు:

"ది స్మైల్ దట్ ఫ్లిక్కర్స్ ఆన్ బేబిస్ లిప్స్, వెన్ హి స్లీప్స్, డజ్ ఎనీబడీ నో వేర్ ఇట్ వజ్ బోర్న్? ఎస్, దేర్ ఈజ్ ఎ రూమర్ దట్ ఎ యంగ్ పేల్ బీమ్ ఆఫ్ ఎ క్రిసెంట్ మూన్ టచ్‌డ్ ది ఎడ్జ్ ఆఫ్ ఎ వానిషింగ్ ఆటమ్ క్లౌడ్ ఎండ్..." ★

[నా మాట: సునిశితుడైన హాలికుడికి —సుక్షేత్రం, పాత్రత పెరిగిన దాతకి— గ్రహీత, 'తేజస్వినా వధీతమస్తు' వంటి భావన కలిగిన గురు శిష్యుల మధ్య అధ్యయనం కుదరడం చాలా కష్టమేమో?

ఈ కథని చదివి తమ అల్లరితనం గురించి ఆలోచించే ఆకతాయి విద్యార్థులకు, తమ ఇర్రెగ్యులారిటీ వల్ల, తమ 'ఇల్లాయల్టీ' వల్ల బలి అయిపోతున్న విద్యార్థుల్ని కలిగిన (కొంతమందైనా) అధ్యాపకులకీ ఈ కథని అంకితం ఇస్తున్నాను.

—భవయిత్రి.]